నమస్తే తెలంగాణ

# రాజన్న సిరిసిల్ల

5 కరీంనగర్, గురువారం 18 జనవరి 2024 RAJANNA SIRCILLA



మాట్లాడుతున్న టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి

## నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలి

**టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, ఎండీ వరుణ్‌రెడ్డి**

పెద్దపల్లి, జనవరి17: సాగు, గృహావసరాల కోసం నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలని ఉద్యోగులు, సిబ్బందికి టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) పీ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ (ఐపీసీ) పీ గణపతి, డైరెక్టర్ (కమర్షియల్) సంధ్యారాణి, డైరెక్టర్ (ఫైనాన్స్) తిరుపతిరెడ్డితో కలిసి బుధవారం పెద్దపల్లిలో సర్కిల్ విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, 33 కేవీ, 11 కేవీ ఫీడర్లలో అంతరాయాలు తగ్గించాలని సూచించారు. వినియోగదారులతో సత్సంబంధాలను పెంపొందించుకోవాలని, అంకిత భావంతో పనిచేసి సంస్థ పురోగతిలో భాగస్వాములు కావాలని నిర్దేశం చేశారు. ఇంజినీర్లు, సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీకి చెందిన 515 మంది వినియోగదారులు కులధ్రువీకరణ పత్రాలు సమర్పించలేదని, వారుఏఈ (ఆపరేషన్) కార్యాలయంలో అందించి 101యూనిట్లకు రాయితీ పొందాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం గృహజ్యోతి స్కీం కింద వినియోగదారుడికి 200 యూనిట్ల రాయితీ పథకానికి అర్హులు కావాలంటే తప్పకుండా విద్యుత్ మీటర్ నంబర్ ఉండాలని, కనెక్షన్ లేని వారు వెంటనే మీసేవలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ (ఏజీఎల్) కోసం మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. వినియోగదారులు బకాయిలు చెల్లించి సంస్థ పురోభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. సమావేశంలో పెద్దపల్లి ఎస్ ఈ బొంకూరి సుదర్శన్, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## 20న నవోదయ ఎంట్రెన్స్ టెస్ట్

చొప్పదండి, జనవరి17: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చొప్పదండి నవోదయ ప్రిన్సిపాల్ మంగతాయారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 80 సీట్ల భర్తీకి నిర్వహిస్తున్న పరీక్షకు ఉమ్మడి జిల్లానుంచి 7,105 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారని, 36 ఎగ్జామినేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు గంట ముందే సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ఏదేనా గుర్తింపు కార్డును వెంట తీసుకుని రావాలని, 11 గంటల అనంతరం వచ్చిన విద్యార్థులను సెంటర్‌లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష రాయాలని, నవోదయలో సీటు సాధించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.



భోజన్నపేట శివారులోని చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ మల్లేశ్, బీఎస్పీ నాయకురాలు దాసరి ఉష

## చెక్‌డ్యాం కూల్చివేత కుట్రపై అనుమానాలు

- ఓ మాజీ ప్రజాప్రతినిధి హస్తం?
- కొలిక్కిరాని విచారణ

**హుస్సేన్‌మియా వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం కూల్చివేత కుట్రపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం వెనుక ఓ మాజీ ప్రజాప్రతినిధి (బీఆర్ఎస్ కాదు) హస్తం ఉన్నట్లుగా విమర్శలు వస్తున్నాయి. సంచలనం సృష్టించిన ఈ కేసులో విచారణపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.**

కరీంనగర్, జవవరి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి జిల్లాలోని హుస్సేన్‌మియా వాగుపై పలుచోట్ల కేసీఆర్ సర్కారు చెక్‌డ్యాంలను నిర్మించింది. గతంలో ఎక్కడికక్కడే నీళ్లు నిండి ఉండడంతో వాగుకు ఇరువైపులా ఉన్న రైతులు మోటర్లు పెట్టుకొని వేలాది ఎకరాలు సాగు చేసేది. ప్రస్తుతం కూల్చివేయాలని చూసిన చెక్ డ్యాంను పెద్దపల్లి మండలం భోజన్నపేట–మూలసాల వద్ద 2018లో ₹4.19 కోట్లతో కట్టింది. ప్రస్తుతం దీనికి ఎగువన కిలో మీటర్ వరకు బ్యాక్ వాటర్ ఉన్నది. అయితే సోమవారం రాత్రి చెక్‌డ్యాంకు పదకొండు చోట్ల డ్రిల్ వేసి, జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చే కుట్ర జరిగిన విషయం తెలిసిందే. నిజానికి ఇక్కడ భారీ కుట్ర జరిగిందనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. కొత్తపల్లికి చెందిన రైతు చాట్ల సదయ్య బాపమ్మ సోమవారం సాయంత్రం చనిపోవడంతో రాత్రి పూట చెక్ డ్యాం సమీపంలోని పొలం వద్ద దహన సంస్కారాలు చేశారు. స్నానాలు చేసేందుకు ఆ గ్రామానికి చెందిన రైతులు చెక్‌డ్యాం వద్దకు వెళ్లారు. ఆ సమయంలో దొంగ చాటున జిలెటిన్‌స్టిక్స్ పెట్టి పేల్చేందుకు కంప్రెషర్‌తో డ్రిల్లింగ్ చేస్తున్న పనులను చూశారు. వెంటనే అనుమానం వచ్చిన సదరు గ్రామస్తులు ఒక్కసారిగా పెద్ద కేకలు వేశారు. దాంతో ఆగంతకులు పారిపోయారు. నిజానికి రైతులు ఆ సమయానికి అక్కడ లేకపోతే.. చెక్‌డ్యాం కచ్చితంగా కూల్చివేసేవారని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఈ ఘటనపై అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. దీని వెనుక ఓ మాజీ ప్రజాప్రతినిధి కుట్ర దాగి ఉందని, సంచనలం సృష్టించేందుకు ఇలా చేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సదరు మాజీ ప్రజాప్రతినిదే.. జిలెటిన్‌స్టిక్స్, ఇతర పరికరాలు సమకూర్చి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే.. పెద్ద పెద్ద కేసులను సైతం గంటల్లో ఛేదించే పోలీసులు, విచారణలో అనుకున్నంత స్పీడ్ ముందుకెళ్లడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా, రైతులు ఈ ఘటనపై మండిపడుతున్నారు. దోషులను కఠినంగా శిక్షించి.. మరోసారి ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటు పంటలకు జీవం పోసే ఒక చెక్‌డ్యాంను కూల్చివేసే సాహసం రైతులు చేయరన్న గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడు లేని పని ఇప్పుడెందుకు చేస్తారన్న ప్రశ్నిస్తున్నారు నిజంగా చెక్‌డ్యాం కింద రైతులకు నీళ్లు అవసరముంటే ప్రజాస్వామిక పద్ధతిలో అడిగేవారని, ఇలా చేయరని స్పష్టం చేస్తున్నారు.

### ఇలాంటోళ్లను వదలద్దు



పదేళ్ల క్రితం హుస్సేన్‌మియా పరిసర గ్రామాల పొలాలు నీళ్ల లేక ఎండిపోయేవి. కేసీఆర్ సర్కారు వచ్చినంక హుస్సేన్‌మియా వాగు మీద చెక్‌డ్యామ్‌లు నిర్మించింది. సమీప గ్రామాల రైతుల నీటి గోస తీర్చింది. కోట్ల రూపాయలు పెట్టి కట్టిన చెక్‌డ్యామ్‌తో భోజన్నపేట, చీకురాయి, కొత్తపల్లి, మూలసాల గ్రామాలకు నీటి కరువు పోయింది. వేలాది ఎకరాలు మంచిగా పండుతున్నయి. సోమవారం రాత్రి దొంగ చాటున చెక్‌డ్యాం పగులగొట్టాలను చూసిన్రు. మేం చూడక పోతే మా రైతుల నోళ్లలో మన్ను పడేది. సారు ఇలాంటోళ్లను వదలద్దు. ఎట్లయినా పట్టుకొని జైళ్ల పెట్టాలి.

**-బత్తుల రాజయ్య,కొత్తపల్లి (పెద్దపల్లి)**

### కాంగ్రెస్ నేతల పనేనని చర్చించుకుంటున్నారు : దాసరి ఉష

కొందరు కాంగ్రెస్ నాయకులే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని ప్రజలు చర్చించుకుంటున్నారని బీఎస్పీ నాయకురాలు ఉష ఆరోపించారు. బుధవారం చెక్‌డ్యాం పరిశీలించిన అనంతరం అమె మాట్లాడారు. భోజన్నపేట చెక్ డ్యాం పేల్చివేత కుట్ర అన్యాయమని మండిపడ్డారు. రైతులకు నష్టం చేసే చర్యలు పాల్పడినా వదలొద్దని స్పష్టం చేశారు. ఈ ఘటనపై నిజ నిర్ధారణ చేసి నిగ్గు తేల్చాలని, దుండగులు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత, పోలీస్, ఇరిగేషన్ అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

## నిందితుడు పరార్

వేములవాడ, జనవరి 17: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పోలీసుల కండ్లుగప్పి ఓ నిందితుడు ఠాణా నుంచి తప్పించుకోవడం పోలీసుశాఖలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లికి చెందిన ఒకరిపై దాడి చేసిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదైంది. నిందితులను రిమాండ్ చేయాల్సిందిగా ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసులు రంగంలోకి దిగారు. అందులో ఒకరు గంభీరావుపేట ప్రాంతంలో ఉన్నారని తెలుసుకొని మంగళవారం రాత్రి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రిమాండ్ చేయాల్సి ఉండగా ఉదయం పూట సదరు నిందితుడు చాకచక్యంగా స్టేషన్ నుంచి పరారయ్యాడు. అతన్ని పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగగా, విధుల నిర్లక్ష్యంపై మాత్రం జిల్లా పోలీస్ బాస్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

## అమ్మక్కపేట శివారులో చిరుత?

**భయాందోళనలో గ్రామస్తులు**



అమ్మక్కపేట శివారులో చెట్టుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అటవీ అధికారులు


ఇబ్రహీంపట్నం, జనవరి 17 : ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట శివారులోని వ్యవసాయ భూముల్లో చిరుత పులి సంచారం కలకలం రేపుతున్నది. గ్రామశివారులోని అటవీ ప్రాంతంతోపాటు వ్యవసాయ తోటలలో రెండ్రోజులుగా సంచరిస్తున్నదని గ్రామస్తులు భయపడుతున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎఫ్‌ఆర్‌వో షౌకత్ అలీ, బుధవారం గ్రామానికి చేరుకొని పాదముద్రలు పరిశీలించారు. ఏ జంతువో..? గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లో కలియదిరిగారు. సంచారం ఉన్న చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

# డీఈవోలు వర్సెస్ పంతుళ్లు



**జిల్లా విద్యాశాఖాధికారులు, పంతుళ్ల మధ్య సాగుతున్న పంతాలు ప్రధానోపాధ్యాయులకు శాపంగా మారుతున్నాయి. సర్దుబాటు, డిప్యూటేషన్లు, బదిలీలు చేసినా పలువురు ఉపాధ్యాయులు విధుల్లో చేరకపోవడంతో ఆయా పాఠశాలల్లో పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. దీంతో సంబంధిత హెచ్‌ఎంలు అగచాట్లు పడుతున్నారు. ప్రధానంగా పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్నా కొద్దీ ఆయా సబ్జెక్టులు బోధించేవారు లేక.. అసలు వస్తారో.. రారో.. తెలియక ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో కొంత మంది టీచర్లు ఉపాధ్యాయ సంఘాల అండతో వక్రమార్గం పడుతుండగా.. మరికొంత మంది పంతాలకు పోతూ పైరవీలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నిర్భయంగా చర్యలు తీసుకోవాల్సిన విద్యాధికారులు వెనుకంజ వేస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. మొత్తంగా ఉన్నత పాఠశాలలపై ప్రభావం పడుతుండగా, ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు సమిధలు కావాల్సి వస్తున్నది.**

- సమిధలుగా మారుతున్న ప్రధానోపాధ్యాయులు
- టీచర్లు పోస్టింగ్‌లో చేరరు.. విధులకు హాజరు కారు
- పైరవీలు, పంతాలకు పోతున్న పలువురు..
- వక్రమార్గంలో వెళ్లే ఉపాధ్యాయులకు వంతపాడుతున్న సంఘాలు
- వ్యవస్థ కన్నా వ్యక్తిగత ప్రయోజనాలకే మద్దతు
- చట్టాలను వినియోగించడంలో విఫలమవుతున్న విద్యాధికారులు
- పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్నా కొద్దీ హెచ్‌ఎంలకు ముచ్చెమటలు



కరీంనగర్, జనవరి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఒక ఉన్నత పాఠశాలలో 160పైగా విద్యార్థులున్నారు. ఇక్కడ హిందీ బోధించే ఉపాధ్యాయుడు బదిలీ అయ్యారు. అలాగే ఆంగ్లంలో బోధించే మరో ఉపాధ్యాయుడిని ఫారిన్ సర్వీస్ కింద కంటిన్యూ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ (సీపీడీ) సెల్‌కు తీసుకున్నారు. దీంతో ఈ పాఠశాలలో ప్రధాన సబ్జెక్టులు బోధించే ఇంగ్లిష్, హిందీ టీచర్లు లేక నెలలు గడుస్తున్నా.. రీప్లేస్‌మెంట్ చేయడం లేదు. ఇది మచ్చుకు మాత్రమే. అలాగే, కరీంనగర్ జిల్లాలో వివిధ అవసరాల కోసం గత నవంబర్, డిసెంబర్‌లో 72 మంది ఉపాధ్యాయులకు సర్దుబాటు కింద ఆర్డర్స్ ఇచ్చారు. సంబంధిత పంతుళ్లు తక్షణమే విధుల్లో జాయిన్ కావాలని ఆదేశించారు. అయినా 33 మంది ఉపాధ్యాయులు విద్యాశాఖ ఉత్తర్వులను పట్టించుకోలేదు. వారికి కేటాయించిన స్థానాల్లో జాయిన్ కాలేదు. దీనిని పరిగణలోకి తీసుకొని ఆ 33 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయినా నేటికి పది మంది విధుల్లో చేరకపోవడంతో మరోసారి నోటీసులు ఇచ్చారు. వీరు తమ విధుల్లో చేరుతారా లేదా..? అన్న దానిపై స్పష్టత లేదు. సీపీడీ సెల్ పేరిట జిల్లా నుంచి పది మంది ఉపాధ్యాయులను తీసుకొని డైట్‌కు డిప్యూటేషన్ ఇచ్చారు. వీరి స్థానంలో సదరు పాఠశాలలకు కొత్త వారిని ఇవ్వలేదు. ఫారిన్ సర్వీసుల పేరిట ఒక్కో జిల్లా నుంచి 10 నుంచి 20 మంది పని చేస్తున్నారు. వీరి స్థానాలను కూడా నేటికి భర్తీ చేయలేదు. ఒక్కో జిల్లాలో దాదాపు 40 మందికిపైగా ఉపాధ్యాయులు లాంగ్ లీవులో ఉన్నారు. వారి స్థానంలో మరొక టీచర్‌ను భర్తీ చేయాల్సి ఉన్నది. కానీ, ఆ నిబంధనలు అమలు కావడం లేదు. అలాగే ఇటీవలే స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు జరిగాయి. అయితే చాలా మంది ఇంకా రిలీవ్ కాలేదు. ఇలా భిన్న కారణాలతో పాఠశాలల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

### సమిధలుగా ప్రధానోపాధ్యాయులు

ఉన్నత పాఠశాలల్లో ప్రధానంగా ఏ అధికారైనా చూసేది పదో తరగతి ఉత్తీర్ణత శాతమే. కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులు, విద్యాధికారుల సమీక్షల్లోనూ సదరు పాఠశాల ప్రగతి గురించి ప్రధానోపాధ్యాయులనే అడుగుతారు. ఆ సమయంలో హెచ్‌ఎంలు సమస్యలు చెప్పే ప్రయత్నం చేసినా ఎవరూ వినరు. సమీక్షా సమావేశాలు జరిగినప్పుడు.. తమ స్కూల్ సమస్యలు విన్నవించేంత ధైర్యం చేసినా పట్టించుకోరు. ఫలితంగా వాస్తవాలు ఒకరకంగా ఉంటే.. తిట్లు మాత్రం ప్రధానోపాధ్యాయులు పడాల్సి వస్తున్నది. తాజా పరిస్థితులను చూస్తే.. ఈ సారి పదో తరగతి ఉత్తీర్ణత దారుణంగా పడిపోయే ప్రమాదం కనిపిస్తున్నది. కారణం ఏమిటంటే.. పోస్టింగ్‌లు ఇచ్చిన చోట ఉపాధ్యాయులు చేరడం లేదు. దీంతో సదరు సబ్జెక్టులు బోధించేవారు లేక హెచ్‌ఎంలు ఆందోళన చెందుతున్నారు. పలుసార్లు ఉన్నతాధికారులకు చెబుతున్నా.. వాళ్లు నిమ్మకు నీరెత్తినట్లుగానే వ్యవహరిస్తున్నారు. 'మీ పాఠశాలలకు పోస్టింగ్ ఇచ్చాం' అని చెబుతున్నారే తప్ప సదరు టీచర్ విధుల్లో చేరాడా..? లేదా..? అన్నది చూడడం లేదు. దీంతో ప్రతి చోటా ప్రధానోపాధ్యాయులే సమిధలుగా మారుతున్నారు. మెజార్టీ హెచ్‌ఎంలు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎవరికి చెప్పుకోలేక.. పాఠశాలల ప్రగతిని ముందుకు తీసుకెళ్లలేక ఇబ్బందులకు లోనవుతున్నారు.

### పలువురు టీచర్లకు అండగా సంఘాలు

సమస్యల పరిష్కారం కోసం పనిచేయాల్సిన పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమ వ్యక్తి గత ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నారు. విధుల్లో చేరకుండా, విద్యాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్న కొంత మంది టీచర్లకు అండగా నిలుస్తున్నారు. 'మేం చూసుకుంటా'మంటూ భరోసానిస్తూ.. విద్యారంగం ప్రగతికి అడ్డుపడుతున్నారన్న విమర్శలను మూటగట్టుకుంటున్నారు. ఏదైనా సంఘం ప్రశ్నిస్తే.. మీరు గతంలో ఇలా చేయలేదా..? అలా చేయలేదా..? అంటూ ఆత్మరక్షణలో పడేస్తున్నారు. దీంతో తమకెందుకులే అన్నట్టు పలు కొన్ని సంఘాల నాయకులు వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లోనే చాలా మంది టీచర్లు సంఘాల అండతో విధులకు ఎగనామం పెడుతున్నారు. విద్యాశాఖాధికారులు ఆదేశాలు ఇచ్చినా.. షోకాజ్ నోటీసులు ఇచ్చినా.. విధుల్లో చేరకుండా విద్యాధికారులతోనే వాదనకు దిగుతున్నారు. అయితే సదరు ఉపాధ్యాయులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖాధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. ఒక వేళ అలా చేస్తే తమ లొసుగులను ఎత్తిచూపడంతోపాటు పాఠశాలలు అవే నడుస్తాయిలే అన్నట్టుగా ఆలోచిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. నిజానికి చట్టాలను నిర్భయంగా వినియోగిస్తే.. సదరు ఉపాధ్యాయులు విధుల్లో చేరే అవకాశాలున్నాయి. కానీ, ఆ ధైర్యం చేయడంలో యంత్రాంగం విఫలమైందన్న విమర్శలున్నాయి. ఈ పరిస్థితుల్లో విద్యావ్యవస్థను కాపాడే ప్రయత్నం చేయల్సిన సంఘాలు వ్యక్తిగత ప్రయోజనాలు, స్వప్రయోజనాల కోసం పెద్దపీట వేయడం కూడా మెజార్టీ ఉపాధ్యాయుల్లో విమర్శలకు దారి తీస్తున్నది. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యాశాఖాధికారులు అన్ని కోణాల్లో ఆలోచించి.. విద్యార్థుల ప్రయోజనాలకు పెద్దపీట వేసేలా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తున్నది.

### లక్ష్య సాధనకు ప్రతికూల ప్రభావం



ఉన్నత పాఠశాలలో నూతన ఒరవడిలో విద్యా బోధన, ఉత్తమమైన ఫలితాల సాధన కోసం విద్యాశాఖ కృషి చేస్తున్నది. అందులో భాగంగా పదో తరగతి విద్యార్థులకు లక్ష్య, ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉన్నతి కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తున్నది. కానీ, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత వల్ల లక్ష్య సాధనలో ప్రతికూల ప్రభావం పడనున్నది. కనీసం ఈ విద్యా సంవత్సరం చివరి రెండు నెలలకైనా విద్యా వలంటీర్లను నియమిస్తే కొంత తీవ్రత తగ్గే అవకాశమున్నది. అలాగే తరగతి గదిలో విద్యాబోధనకు అవకాశం ఇవ్వాలి. ఇతర అన్ని రకాల స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్, పేరెంట్ టీచర్ మీటింగ్ తదితర కార్యక్రమాలను వచ్చే రెండు నెలలపాటు నిలివేయాలి. **-పీ రాజభాను చంద్రప్రకాశ్, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు**

# సర్కారు విద్యపై భరోసాకు లంచ్ అండ్ లర్న్

- పెద్దపల్లి కలెక్టర్ చొరవతో ప్రత్యేక కార్యక్రమం
- ప్రతి బుధవారం జిల్లా అధికారి ఓ పాఠశాల సందర్శన
- గత నెల 13నే ప్రారంభం.. విజయవంతంగా అమలు

**విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి బుధవారం జిల్లా అధికారి ఓ పాఠశాల లేదా గురుకులంలో వసతులను పరిశీలించి.. సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో గత నెల 13న 'లంచ్ అండ్ లర్న్'ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం సత్ఫలితాలనిస్తున్నదని అధికారులు చెబుతున్నారు.**



పెద్దపల్లిలోని రంగంపల్లి మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ (ఫైల్)

పెద్దపల్లి, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : 'లంచ్ అండ్ లర్న్'లో భాగంగా కలెక్టర్, అదనపు కలెక్టర్లతో సహా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ప్రతి బుధవారం ఒక ప్రభుత్వ పాఠశాలను సందర్శించాలి. అక్కడి విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, వసతి సౌకర్యాలు, పరిసరాలను పరిశీలించాలి. అంతేకాకుండా విద్యార్థులతోనే కలిసి మధ్యాహ్న భోజనం చేయాలి. ఆ తర్వాత పాఠశాలపై ఒక చెక్ లిస్ట్‌ను నింపి జిల్లా విద్యాశాఖకు పంపించాలి. దాని ఆధారంగా అక్కడ మెరుగైన బోధనతోపాటు వసతులు కల్పించేందుకు కృషి చేస్తారు' ఇలా ఒక గొప్ప ఉద్దేశ్యంతోనే కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి డిసెంబర్ 13న ప్రారంభించారు. మొట్టమొదట పెద్దపల్లిలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులతో కలిసి లైన్‌లో నిలబడి ప్లేటులో భోజనం పెట్టుకొని, డైనింగ్ హాల్‌లో భోజనం చేశారు. విద్యాబోధన, వసతి సౌకర్యాలు, భోజనం, ఇతర అంశాలన్నీ పరిశీలించి ఒక చెక్ లిస్ట్ తయారు చేశారు. ఇలానే జిల్లాలోని అధికారులంతా పాఠశాలలను సందర్శిస్తున్నారు. కెరీర్ గైడెన్స్ సంబంధిత అంశాలను వివరిస్తూ.. పిల్లలను చదువుపై ఆసక్తి పెంచుతున్నారు. అలాగే చెక్‌లిస్ట్‌ను తయారు చేసి విద్యాశాఖకు పంపిస్తున్నారు.



స్కూల్‌లో వంటలను పరిశీలిస్తున్న డీఆర్డీవో శ్రీధర్

### ఐదు పాఠశాలల దత్తత

మొదటి విడుతగా జిల్లాలోని ఐదు ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ సహా అధికారులు దత్తత తీసుకున్నారు. కొత్తూరును కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌ను డీఆర్డీవో శ్రీనివాస్, కటికెనపల్లిని డీఈవో మాధవి, జూలపల్లి మండలం కాచాపూర్‌ను షేక్, రామగుడం ఎఫ్‌సీఐ స్కూల్‌ను అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ దత్తత తీసుకున్నారు.

### విద్యార్థుల కోసమే



సర్కారు విద్యాలయాల్లో, వసతి గృహాల్లో విద్య, ఆహార నాణ్యత, వసతులను మెరుగుపర్చడంతో పాటు విద్యపై భరోసా కల్పించాలనే లక్ష్యంతో 'లంచ్ అండ్ లర్న్' కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టాం. జిల్లా స్థాయి అధికారి వచ్చి విద్యార్థులతో గడపడం వల్ల వారికి చదువుపై ఆసక్తి కలుగుతుంది. సక్సెస్ గురించి జిల్లా అధికారుల బృందం విద్యార్థులను మోటివేట్ చేస్తున్నది. ప్రతి సోమవారం ప్రజావాణి పూర్తయిన తర్వాత ఈ కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్షిస్తున్నాం. ఇప్పుడిప్పుడే సత్ఫలితాలు వస్తున్నాయి. ఇంకా మంచి సక్సెస్ సాధిస్తాం.

**- ముజామ్మిల్‌ఖాన్, కలెక్టర్ (పెద్దపల్లి)**

### మంచి జరుగుతుంది



లంచ్ అండ్ లర్న్ కార్యక్రమం ద్వారా బహుళ ప్రయోజనాలు నెరవేరుతున్నాయి. జిల్లా అధికారి విద్యార్థుల వద్దకే రావడంతో ఎలాంటి ఇబ్బంది ఉన్నా చెప్పుకునే అవకాశం ఉంటుంది. నేను మూడు పాఠశాలలను సందర్శించిన. మొదటి వారానికి మూడో వారానికి చాలా తేడా ఉన్నది. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులకు చాలా మంచి జరుగుతున్నది.

**-చందుపట్ల శ్రీమాల, జిల్లా సహకార అధికారి (పెద్దపల్లి)**



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

## బతుకమ్మ చీరెల బకాయిలు విడుదల చేయాలి

- సంక్షేమ, అభివృద్ధి పథకాలు యధావిధిగా కొనసాగించాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

రాజన్న సిరిసిల్ల, జనవరి 17 (నమస్తే తెలంగాణ): బతుకమ్మ చీరెల బకాయిలు ₹250 కోట్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. కేసీఆర్ సర్కారు నేతన్నల సంక్షేమం కోసం తెచ్చిన సంక్షేమ పథకాలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాక ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నదని, వందల సంఖ్యలో నేతన్నలు ఆకలిచావులు, బలవర్మణాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో సిరిసిల్లకు వచ్చిన కేసీఆర్ 'నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవద్ద'ంటూ గోడల పైన రాతలు చూసి చలించి పోయారని, చందాలు వసూలు చేసి ₹50లక్షలు పద్మశాలీ ట్రస్టుకు అందజేశారని గుర్తు చేశారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను అన్ని విధాలుగా ఆదుకోవడంతోపాటు నేతన్నల బతుకులకు భరోసా కల్పించేలా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత, మరమగ్గాల కార్మికులకు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్‌దేనన్నారు. నేతన్నలకు ప్రతి నెలా ₹15వేల నుంచి ₹20 వేలు కూలీ వచ్చేలా బతుకమ్మ చీరెల ఆర్డర్లు ఇచ్చారని, కార్మికులకు శాశ్వతంగా ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఆర్వీఎం, రంజాన్, క్రిస్మస్ వస్త్రాల ఉత్పత్తులు సిరిసిల్లకే ఇచ్చారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వలసలు వాపస్ వచ్చాయని, ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడకు వచ్చి ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి కార్మికుడికీ రైతు బీమా తరహాలో ₹5లక్షల బీమా సౌకర్యం కల్పించిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నేతన్న సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. కేసీఆర్ సర్కారు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కొనసాగించాలని కోరారు. అలాగే వర్కర్‌టూ ఓనర్ పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యాక్షుడు జిందం చక్రపాణి, కార్యదర్శి మ్యాన రవి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, నాయకులు చీటి నర్సింగరావు, న్యాలకొండ రాఘువారెడ్డి, బండ నర్సయ్య పాల్గొన్నారు.